క్లుప్తంగా

జీవాల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న డాక్టర్ గాయత్రి

లావేరు: గొర్రెలు, మేకల పెంపకంలో సరైన జాగ్రత్తలు పాటించాలని లావేరు పశువైద్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ బి.గాయత్రి అన్నారు. లావేరు పంచాయతీ పరిధి వడ్డిపేట గ్రామంలో శనివారం పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. జీవాల పెంపకంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, వాటికి వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు గురించి పశువైద్యాధికారి పెంపకందారులకు అవగాహన కల్పించారు. జీవాలకు వ్యాధులు రాకుండా ఉండటం కోసం ముందుగా టీకాలు వేయించాలని సూచించారు. వెటర్నరీ ఉద్యోగి మామిడి జగదీష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఈఈ సత్తారు బయ్యన్నాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎచ్చెర్ల, గుజరాతీపేట 33/11 సబ్ స్టేషన్లు పరిధిలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకు, ధర్మవరం, కొయ్యాం 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సామాజిక భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతిఒక్కరూ సమాజ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఫరీదుపేట గ్రామ పంచాయతీ పరిధి ఉషోదయ కాలనీలో నిర్మించిన సామాజిక భవనాన్ని శనివారం ప్రారంభించారు. కాలనీ వాసులు ఐక్యంగా ఉంటూ సమాజ ప్రయోజన కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగాలని సూచించారు. సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

నేడు కొవ్వాడలో 'స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్'

రణస్థలం: ప్రపంచ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా కొవ్వాడ సముద్ర తీరంలో ఆదివారం స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మత్స్యకార సంక్షేమ సమితి ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, మత్స్యకార ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొంటారన్నారు.

అరసవల్లిలో 'స్వచ్ఛతే సేవ' ర్యాలీ


అరసవల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

అరసవల్లి: మున్సిపల్ కార్పొరేషన్‌లో భాగంగా ఉన్న అరసవల్లి పరిసరాల్లో స్వచ్ఛతే సేవ ర్యాలీ కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులతో కలిసి ఆలయ అధికార సిబ్బంది సంయుక్తంగా శనివారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆలయ ఈఓ వి.హరి సూర్యప్రకాష్‌ల ఆధ్వర్యంలో అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయ పరిసరాల్లో ప్రధాన రహదారుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2 (స్వచ్ఛ భారత్ దివస్) వరకు జరుగనున్న ఈ కార్యక్రమాన్ని గార్బేజ్ ఫ్రీ ఇండియా అవగాహన ర్యాలీని స్థానికుల సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ జి.వెంకటరావు, సూపర్‌వైజర్ బెహరా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఔదార్యం


కృష్ణవేణికి సాయాన్ని అందజేస్తున్న శ్రీరామమూర్తి

జి.సిగడాం: దవళపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు కృష్ణవేణి భర్త గత ఏడాది మరణించారు. అయితే సాంకేతిక సమస్యలతో ఆమెకు వితంతు పింఛను మంజూరు కాలేదు. దీంతో ఆమెకు అండగా ఉండేందుకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పేడాడ శ్రీరామమూర్తి ముందుకొచ్చారు. పింఛన్ మంజూరయ్యే వరకూ ఆమెకు నెలకు మూడు వేల రూపాయలు అందించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా కృష్ణవేణికి శనివారం రూ. మూడు వేలు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

● మట్టి గణపతికి జై



మట్టి గణపతి ప్రతిమలను తయారుచేస్తున్న విద్యార్థులు


విగ్రహాన్ని తయారుచేస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు


తాము తయారుచేసిన మట్టి గణపతి ప్రతిమలను చూపిస్తున్న బహుమతి సాధించిన విద్యార్థులు


మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ పి.జగన్మోహనరావు


మాట్లాడుతున్న రిటైర్డ్ డీఈవో బలివాడ మల్లేశ్వరరావు

'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త నిర్వహణలో శ్రీకాకుళంలోని న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా శనివారం 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' కార్యక్రమం నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని మట్టి ప్రతిమలు తయారు చేశారు. శిక్షణ అనంతరం చక్కటి ప్రతిమలు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

–శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● పేదల అభ్యున్నతికి ప్రాధాన్యం
● గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు


ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర ప్రజలంతా ఈరోజు గౌరవంగా జీవనం సాగిస్తున్నారంటే దీనికి కారణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి ఉండడవల్లే సాధ్యమైందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని 45వ డివిజన్ ఇన్‌చార్జి అరుణ్‌కుమార్‌గుప్తా ఆధ్వర్యంలో ఫాజుల్ బేగ్‌పేట సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు పథకాలు అందుతున్న తీరు తెలుసుకున్నారు. మహిళల పేరిట ఇళ్లు, అమ్మఒడి, చేయూత వంటి పథకాలతో ఆర్థిక లబ్ధి చేకూర్చుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ధనాన్ని వారి అభ్యున్నతికే ఖర్చు చేస్తున్నారన్నారు. పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ అందుకనుగుణంగా వ్యవస్థలలో మార్పులు తీసుకువచ్చామన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వం పట్ల ప్రతిపక్షాలకు ఏం విమర్శించాలో తెలియడం లేదన్నారు. ఏమి చేస్తున్నామో ఇంటింటికీ వెళ్లి చెప్పగలుగుతున్నాం ....టీడీపీ నాయకులు వారి పాలనలో ఏం చేశారో ధైర్యంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. అన్ని వర్గాలూ ఆనందంగా ఉండాలని చేతి వృత్తులు వారికి చేయూతనిస్తున్నామన్నారు. కాపునేస్తం పేరిట అర్హులైన ఒక్కో మహిళ ఖాతాలో రూ.15వేలు జమ చేస్తున్నామన్నారు. ఇవన్నీ ప్రజా క్షేమం కోసమేనని, పాలనలో వచ్చిన మార్పులు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేసు, యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్‌మాజీ చైర్మన్ ఎం.వి పద్మావతి, పార్టీ నగర అధ్యక్షుడు సాదు వైకుంఠరావు, డాక్టర్ ధానేటి శ్రీధర్, డాక్టర్ పైడి మహేశ్వరరావు, ఎన్ని ధనుంజయరావు, కోణార్క్ శ్రీను, మండవిల్లి రవి, ఊన్న నాగరాజు, నక్క రామరాజు, రుప్ప శేషగిరిరావు, ఉట్ల శ్రీనివాస్, తెలుగు రమేష్, బరాటం సంతోష్, సుంకరి కృష్ణ, కనపల తేజ, వానపిల్లి రమేష్, కరుణ్, పందిరి ధనుంజయ్, బచ్చు శ్రీను, రాము రెడ్డి, చలపతి, సూర్యరావు, నందేష్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు


హైకోర్టు న్యాయమూర్తితో బార్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.శ్రీనివాస్ రెడ్డిని జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శనివారం జిల్లాకు వచ్చిన హైకోర్టు జడ్జిని ఆర్అండ్‌బీ బంగ్లాలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాతో ఉన్న అనుబంధాన్ని జడ్జి పంచుకున్నారు. జడ్జిని కలిసిన వారిలో జిల్లా న్యాయ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వాన కృష్ణ చంద్, ఆపీస్ నాయుడు, శిష్టు రమేష్, పి.వి.రమణ దయాల్, ఎం.భవానీప్రసాద్, ఏఎల్ నారాయణ, బీసీ న్యాయవాదులు సంఘం ప్రతినిధులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, పొన్నాడ వెంకటరమణ, జల్లు తిరుపతిరావు, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు


జస్టిస్ శ్రీనివాసరెడ్డికి ఆదిత్యుని జ్ఞాపికనుఅందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: శ్రీకాకుళం సమీపంలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు పి.శ్రీనివాసరెడ్డి (జిల్లా జ్యుడీషియల్ పోర్టు ఫోలియో జడ్జి), తర్లాడ రాజశేఖరరావు శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వీరికి ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరించి, అనివేటి మండపంలో ఆశీర్వచనాలను అందజేసి తీర్థ ప్రసాదాలను ఇచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, ఎస్సీ, ఎస్టీ విభాగ న్యాయస్థానాల న్యాయమూర్తి ఫణికుమార్, జూనియర్ సివిల్ జడ్జి శారదాంబ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేద్దాం

● ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గెడ్డకంచరాం గ్రామంలో కార్యకర్తలతో ఆత్మీయ కలయిక కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు వస్తున్నారని.. వీరిని గ్రామస్థాయిలో ఉండే పార్టీ కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన ఆరు వందల హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయని విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, నాయకులు పరసరావు నారాయణుడు, కాయల అప్పన్న, చిట్టిబాబు, వైకుంఠరావు, వాన వెంకటరమణ, లక్ష్మణరావు, సత్యం, పెంటయ్య, శ్రీనివాసరావు, రమణ వీఆర్వో పొట్నూరు జగన్నాథం ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ


పింఛన్లను అందజేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: అర్హులందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్లు మంజూరు చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. శ్రీకూర్మం పంచాయతీలో నాలుగు సచివాలయాల్లో పరిధిలో వైఎస్సార్ పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ అంధవరపు రామలక్ష్మి, సర్పంచ్ జి.అనిత, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి


ఎచ్చెర్ల క్యాంపస్: చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రామారావు నాయుడు అన్నారు. పొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓజోన్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్య నియంత్రణతోనే ఓజోన్ పొర పరిరక్షణ సాధ్యమన్నారు. కాలుష్య వ్యర్థాలను నియంత్రించాలన్నారు. 33 శాతం అడవులు ఉండేలా మొక్కలు పెంచాల్సిన బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎల్.అమ్మాజీ పాల్గొన్నారు.

అందరి సహకారంతో పోషకాహార లోపం నివారణ

● మంత్రి ధర్మాన ప్రసాదరావు


మెడికల్ కిట్లను అందజేస్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: అందరి సహకారంతోనే పోషకాహార లోపం నివారణ జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆవరణలో వైఎస్సార్ పోషణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. మంత్రి ధర్మాన మాట్లాడుతూ చిన్నారుల పోషణకు అంగన్‌వాడీలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. అమ్మ తర్వాత అంగన్‌వాడీలే కీలకమన్నారు. జిల్లాలోని రూరల్ ప్రాజెక్టులలో గార ప్రాజెక్టు ముందంజలో ఉండటం సంతోషకరమన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా టేక్‌హోం రేషన్ అందివ్వడం జరుగుతుందన్నారు.

రానున్న కాలంలో ఎన్ని బయటపడతాయో

చంద్రబాబు అక్రమాలు రానున్న కాలంలో ఎన్ని బయటపడతాయో చూడాల్సి ఉందని మంత్రి అన్నారు. సీమెన్స్ కంపెనీ పేరిట రూ.371 కోట్లు చంద్రబాబులా దోచుకున్నారని దర్యాప్తు సంస్థలు తేల్చాయని, అందువల్లే రిమాండ్ విధించడం జరిగిందన్నారు. వీరికి అనుకూలంగా ఉన్న మీడియా రోజుకో రకంగా కథనాలు వేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, పీడీ బి.శాంతిశ్రీ, ఎంపీపీ అంబటి నిర్మల శ్రీనివాస్, జెడ్పీటీసీలు మార్పు సుజాతమ్మ, రుప్ప దివ్య, పార్టీ కన్వీనర్ పీస గోపి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, సీడీపీఓ రాధామాధవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజించాలి


మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న పీసీబీఈఈ రామారావు నాయుడు, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: ప్రజలందరూ వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులనే పూజించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం అధికారి ఎ.రామారావు నాయుడు విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం కళాజాతర బృందం వారితో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించి మున్సిపల్ కార్యాలయం, రైతు బజారు, డే అండ్ నైట్, ఏడు రోడ్ల, సూర్యామహల్ కూడళ్లల్లో సుమారుగా 5 వేల మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం


మాట్లాడుతున్న అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాల్లో కళింగ కోమటి అని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలుమార్లు కేంద్రానికి సిఫార్సు చేశారని కళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్ శ్రీను హర్షం వ్యక్తం చేశారు. ఓబీసీలో చేర్చితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, మెడికల్ సీట్లు, ఐఐటీల్లో సీట్లలో రిజర్వేషన్ లభిస్తుందన్నారు. ఓబీసీ జాబితాలో చేర్చేందుకు చొరవచూపిస్తున్న సీఎం జగన్‌కు జీవితకాలం కళింగవైశ్యులు రుణపడి ఉంటామన్నారు. ఈ సమావేశంలో కళింగకోమటి సంఘ నాయకులు ఊన్న నాగరాజు, తంగుడు నాగేశ్వరరావు, అంధవరపు ప్రసాద్, వైశ్యరాజు మోహన్, గుడ్ల దామోదరరావు, నవతా బాబ్జి, కిల్లంశెట్టి కరుణకుమార్, ఎ.వి రమేష్, టంకాల కృష్ణ, బరాటం చంద్ర, గుడ్ల నాగేశ్వరరావు, గుడ్ల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నియంత్రిద్దాం


ఓజోన్ పొర రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


ఓజోన్ అణువు ఆకృతిలో విద్యార్థినులు

ఎచ్చెర్ల క్యాంపస్: సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ కాలుష్య నియంత్రణకు కృషిచేయాలని చిలకపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చౌదరి లీలావతి అన్నారు. పాఠశాలలో శనివారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఓజోన్ పొర దెబ్బతింటే భవిష్యత్తు తరాలకు అనేక అనర్థాలు ఎదురవుతాయన్నారు. ఓజోన్ పొరను దెబ్బతీసే క్లోరో ఫ్లోరో కార్బన్ల వినియోగం తగ్గాలని చెప్పారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. జీవశాస్త్రం ఉపాధ్యాయులు చావలి శ్రీనివాస్ ఓజోన్ పొర రక్షణకు తీసుకోవల్సిన చర్యలు వివరించారు.

ఓజోన్ పొరను రక్షించుకోవాలి

లావేరు: మురపాక గ్రామం పీబీనగర్ కాలనీలోని కేజీబీవీలో శనివారం అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ బి.సుధ ఆధ్వర్యంలో బాలికలు ఓజోన్ అణువు ఆకృతిలో కూర్చొని ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కనుగులవానిపేట గ్రామంలో పేదలకు పట్టాలు ఇచ్చిన జగనన్న లేఅవుట్ స్థలాల్లో కొంతమంది కబ్జాదారులు 67 సెంట్ల విస్తీర్ణంలో కొంతభాగాన్ని ఆక్రమించడంతో వాటిని శనివారం తొలగించారు. తహసీల్దార్ ఎస్.వెంకట్రావు, టౌన్ సీఐ సన్యాసినాయుడు పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు, రూరల్ పోలీసులు కలిసి ఆక్రమణలు తీసివేయించారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బైరి గ్రామంలో ఆదివారం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనువాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.